


# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

## ముందు మాట

ఈ పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

**ఓ సోదరి, గుంటూరు:**

**నేను డిగ్రీ చదివాను. ఓ స్కూల్లో రిసెప్షనిస్ట్ గా పని చేస్తున్నాను. మా స్కూల్లో ఉండే ఓ మాస్టారు ఈ మధ్య నా దగ్గరకు వచ్చి, నేనంటే చాలా ఇష్టమని చెప్పారు. నాతో జీవితాంతం కలిసి బతకాలని ఉంది అన్నారు. ఈ మాట నేను నాతో స్నేహంగా ఉండే మరో టీచర్ తో చెబితే.. అతనికి ఆల్రెడీ పెళ్ళయిపోయింది అని ఆవిడ చెప్పారు. నాకు చాలా కోపం వచ్చింది. వెళ్లి అడిగేశాను. 'పెళ్లయింది కానీ భార్య మంచిది కాదని, తనని వదిలేసి నన్నుపెళ్లి చేసుకుంటా'నని చెబుతున్నారు. మాది చాలా పేద కుటుంబం. నా ఉద్యోగమే మా కుటుంబానికి ఆధారం. నా పెళ్లి చేయడానికి కూడా అమ్మానాన్నలు కష్టపడాలి. అతను చెప్పేది నిజమే అయితే, నేనతణ్ని పెళ్లి చేసుకోవచ్చా?. తన మాటలు నమ్మొచ్చా? అతను నిజమే చెబుతున్నాడని ఏంటి గ్యారంటీ? సలహా ఇవ్వండి.**

ఇందులో నమ్మకాల, అపనమ్మకాల ప్రసక్తి ఏమున్నది? చీకట్లో ఉన్నపుడు, అక్కడే ఉండిపోవడం కన్నా కనపడుతున్న వెలుగు వైపుకి వెళ్ళటం అభిలాషణీయం కాదా? కానీ అది వెలుగా... మిణుగురు పురుగా? అనేది ముందు నిశ్చయించుకోవాలి. వెళ్తున్న దారిలో ముళ్ళపొదలు, సుడిగుండాలు ఉన్నాయేమో గమనిస్తూ జాగ్రత్తపడాలి.

మీతో వివాహం గురించి ప్రపోజల్ పెట్టినప్పుడు, తన మొదటి భార్య సంగతి ఎందుకు చెప్పలేదో మీరు ముందు కన్విన్స్ అవ్వండి. అతడు చెప్పిన కారణం నిజమనిపిస్తే, మీ తండ్రి గారిని వెళ్ళి ఆ మాష్టారుతో మాట్లాడమని చెప్పండి.

మొదటి భార్యతో విడాకులు ఎంతవరకు వచ్చాయో కనుక్కోండి. మొదటి భార్య వల్ల ఆయనకి సంతానం ఉందో లేదో... విడాకులిస్తున్న సమయంలో కోర్టు ఏ రకమైన ఆంక్షలు పెట్టిందో... ఆయన ఆస్తిలో ఎవరికి ఎంత వాటా చెందుతుందో... మొదలైన వివరాలన్నీ సేకరించిన తర్వాతే ఒక నిర్ణయానికి రండి.

దానికన్నా ముఖ్యంగా, మీ వివాహం జరిగిన తర్వాత కూడా మీరు ఉద్యోగం చేస్తాననీ, ఆ జీతం మీ బీద తల్లిదండ్రులకే చెందుతుందనీ ఆయన్ని ఒప్పించండి. ఈ మధ్య నేను తీసిన (కన్నడ) సినిమాల్లో ఒక డైలాగు ఉన్నది: 'మొగాళ్ళు మొగుళ్ళయ్యాక పెళ్లికి ముందున్నంత దయాగుణంతో ఆ తరువాత ఉండరు' అని. ఆ విషయం గుర్తు పెట్టుకుని పక్కాగా పెద్దల సమక్షంలో ఏర్పాట్లు కోరండి.

**జ్యోతిప్రకాశ్:**

**నేను ఇంజినీరింగ్ చదువుతున్నాను. చిన్నప్పట్నుంచీ ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాను. కానీ ఎప్పుడూ తనకు చెప్పలేదు. ఇద్దరం ఫ్రెండ్లీగా ఉంటాం. తను నాతో చాలా బాగా మాట్లాడుతుంది కానీ నన్ను ప్రేమిస్తుందో లేదో తెలీదు. ప్రపోజ్ చేద్దామంటే 'చేయొచ్చా లేదా' అనిపిస్తోంది. మీరు సలహా ఇవ్వండి సర్. నేను తనకు నా ప్రేమను తెలపవచ్చా? లేక లైఫ్ లో సెటిలయ్యాక చేయమంటారా?**

అజ్ఞాతవాసం ముగించి ధర్మరాజు తిరిగి తన రాజ్యానికి వెళ్ళబోతున్న ముందు రోజు, ఒక బిచ్చగాడు 'కాసింత ధర్మం చేయండి మహాప్రభో' అని అడిగాడట. "రేపు రా! తప్పక సహాయం చేస్తాను" అన్నాడట ధర్మజుడు. అది విని భీముడు ఒక డప్పు తీసుకుని కొండపై కెక్కి నాలుగు దిక్కులూ వినపడేలా "...సత్యవంతుడు నా అన్నయ్య తొలిసారి అబద్ధం చెప్పాడు" అని గట్టిగా అరిచాడట. అతడి చాటింపు అర్థం కాని ధర్మరాజు వివరణ అడిగితే భీముడు ఇలా అన్నాడట. "అన్నా! రేపటి వరకూ ఆ బిచ్చగాడు బ్రతికుంటాడో లేదో నీకు తెలియదు. నీవు ఉంటావో లేదో అతడికి తెలీదు. మనం వెళ్ళాక రాజ్యం దక్కుతుందో లేదో మనకు తెలియదు. రాజ్యం వచ్చాక కూడా నీ మనసు ఇటువంటి దయాగుణంతోనే ఉంటుందో ఎవరికీ నమ్మకం లేదు. అయినా నువ్వు అలా వాగ్దానం చేసావంటే, అది అనృతం కాక మరేమిటి?"

ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే... మీరు లైఫ్ లో సెటిలయ్యే సరికి మీ మనసులో ఆ అమ్మాయి పట్ల ఇంకా అంత ప్రేమ ఇంకా ఉంటుందో లేదో మీకు తెలియదు. మీరు పూలదండ పట్టుకు వెళ్లేసరికి అప్పటికింకా ఆ అమ్మాయి అవివాహితగానే ఉంటుందో లేదో

ఆమెకు తెలీదు. ఇంకో కుర్రాడి ప్రేమలో పడకుండా ఉంటుందో లేదో మనకు నమ్మకం లేదు. కాబట్టి, మీరు మిత్రమా మీ ప్రేమ భావాన్ని వెంటనే వెళ్ళి ఆ అమ్మాయికి చెప్పండి. అయితే దానికి ముందు మీరు మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు వేసుకోండి:

మీ పెద్దలు, ఆమె పెద్దలు ఈ వివాహానికి ఒప్పుకుంటారా? ఒప్పుకోకపోయినా మీరు వివాహం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారా? అలా చేసుకుంటే ఇంజనీరింగ్ చదివే మీకు, సంసారం నిలబెట్టేటంత ఆర్థిక స్తోమత ఉన్నదా? లేక మీ కాళ్ళ మీద నిలబడే వరకు తల్లిదండ్రుల మీద ఆధారపడి తిని, ప్రేమ విషయం రహస్యంగా ఉంచి, ఆ తర్వాత వాళ్ళు కాదంటే, ఎదిరించి వెళ్ళిపోదామని అనుకుంటున్నారా? అది అన్నిటికన్నా నీచమైనది.

### వివరాలు రాయలేదు:

**నేను పీజీ చేస్తున్నాను. నాకొక వివాహితతో పరిచయం అయ్యింది. తనకి మూడేళ్ల బాబు ఉన్నాడు. బాబు పుట్టగానే భర్త చనిపోయాడట. వాళ్ల పుట్టింట్లో ఉంటోంది. అనుకోకుండా నాకు దగ్గరైంది. వాళ్ల ఇంట్లోవాళ్లు తనకి వేరే సంబంధం చూస్తున్నారు. కానీ తాను చేసుకోనంటోంది. అలా అని నేను తనని చేసుకోలేను. మా ఇంట్లోవాళ్లు ఒప్పుకోరు. ఆ విషయం చెబితే పెళ్లి చేసుకోకపోయినా ఫర్వాలేదు, నీ కోసం బతుకుతాను అంటోంది. వేరే అమ్మాయిని చేసుకో, తనతో కాపురం చెయ్యి, కానీ నాతో మాట్లాడుతూ ఉంటే చాలు అంటోంది. తనకి నేనంటే చాలా ఇష్టం. నాక్కూడా తనంటే చాలా ఇష్టం. తనమీద నాకు నమ్మకం ఉంది ఇబ్బంది పెట్టదని. అయినా ఏదో భయం. నేనేం చేయాలి?**

మీ భార్య మీ మొదటిరాత్రి తన జీవితానికి సంబంధించిన ఇదే సంఘటన మీతో చెప్పి, "ఆయన చాలా మంచివారు. భార్య పోయింది. అనుకోకుండా నాకు దగ్గరయ్యారు. మనల్ని ఇబ్బంది పెట్టరు. 'నువ్వు వేరే అబ్బాయిని చేసుకో. తనతో కాపురం చెయ్యి' అని ప్రోత్సహించారు. నేను కేవలం ఆయనతో మాట్లాడుతూ ఉంటే చాలట..." అని చెప్తే, మీకు ఎలా ఉంటుందో ఆలోచించండి. మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

### గిరీశం, విజయనగరం.



**ప్రేమకు సంబంధించిన మీ శీర్షికలో ప్రశ్నలు చదువుతూ ఉంటే, ఇలాంటి సమస్యలు కూడా ఉంటాయా అనిపిస్తోంది. ప్రేమ మీద నమ్మకమే పోతోంది. యువత మీద జాలి కలుగుతోంది.**

నిజమైన ప్రేమలో కష్టాలు ఉండవు. విషాదం ఉండదు. ప్రేమని గెలవాలన్న ధైర్యం ఉంటుంది. అనివార్య కారణాలవల్ల ఓడిపోతే, కుటుంబం కోసమో మరో వ్యక్తి కోసమో త్యాగం చేశానన్న ఆనందం ఉంటుంది. విషాదం ఉన్నది ప్రేమ కాదు. ఆకర్షణ. చదువు గమ్యంగా ఉండవలసిన యువతకు (వారిపై జాలి పడకుండా/వారి సమస్యలకు నవ్వుకోకుండా) ఈ విషయాన్ని చెప్పటమే ఈ శీర్షిక.

(ఇక్కడితో ప్రేమ ప్రసక్తి సమాప్తం).

## దాంపత్య సమస్యలు

### పేరు లేదు.

**మనిషి పెళ్ళెందుకు చేసుకోవాలి?**

దీనికి చాలా మంది కామెడీగా, వేదాంతపూర్వకంగా, సామాజికపరంగా, ఒక బయొలాజికల్ నీడ్‌గా... ఇలా చాలా రకాలుగా సమాధానం ఇచ్చారు. నేను కొత్తరకంగా ఇవ్వటానికి ప్రయత్నిస్తాను. ఎన్నో గొప్ప విషయాల్ని మనం బాల్యంలో గుర్తించం. అమ్మ వంట రుచి తెలుసుకోవాలంటే. అబ్బాయిలూ, నాన్న సహనం విలువ తెలియాలంటే అమ్మాయిలూ... ... పెళ్ళి చేసుకోవాలి

**లావణ్య, మెయిల్:**

**మావారు మంచివారు. ఆయనకు ఎలాంటి చెడు అలవాట్లూ లేవు. కానీ ఒకే ఒక్క లోపం. నన్ను చాలా బాధ పెడతారు. ఆయనకసలు పెళ్లంటే ఇష్టం లేదు. సన్యాసి అవుదామనుకున్నారట. వాళ్ల ఇంట్లోవాళ్ల బలవంతంతో పెళ్లి చేసుకున్నారని నాకు తెలిసింది. నాకు చాలా బాధేసింది. ఆయన నాతో ఏమీ మాట్లాడరు. ఏమీ షేర్ చేసుకోరు. నాతో ఫ్రీగా ఉండరు. తనని మార్చాలని ప్రయత్నించి అలసిపోయాను. ఏం చేయాలో అర్థం కావడం లేదు. తనని మార్చే మార్గం ఉంటే చెప్పండి.**

సంసారంలో అభిప్రాయభేదాలు తప్పవు. దాంపత్యం చేదుగా మారటానికి పెద్దగా కారణాలవసరం లేదు. 'సర్దుకుపోలేక పోవటం' అన్న ఒక్క కారణం చాలు. "ఎక్కడ కాంప్రమైజ్ కావాలి? ఏ పరిస్థితుల్లో కాంప్రమైజ్ కావాలి? ఎవరు సర్దుకుపోవాలి?" అన్నది సమస్య. "బాధపడుతూ కలిసుండాలా? విడిపోయి సుఖంగా ఉండాలా?" అన్నది ఇంకా పెద్ద సమస్య.

మూడు రాత్రుల దాంపత్యంలో ఉండేది 'దాహం'. దాన్ని మూడు నెలల పాటు నిలబెట్టేది 'మోహం'. మూడేళ్ళకాలంలో 'ఆప్యాయత'గా మారి, ముప్పై సంవత్సరాల పాటు అదే సాంద్రతతో నిలవగలిగితే అది 'అనుబంధం'. మొదటి రోజు ఉన్నంత బిలాంగింగ్‌నెస్‌తో జీవితపు చివరిరోజు వరకూ ఉంటే అదే 'ప్రేమ'.

పట్టూ విడుపులతో సర్దుకు పోలేని ఇద్దరు మూర్ఖులు, లేదా ఇద్దరు మితిమీరిన తెలివైన వారు, ఇద్దరు వితండవాదులు మంచి దంపతులయ్యే ఛాన్సు తక్కువ. అదే విధంగా ఒక మంచి భార్య, మంచి భర్త ఒక మంచి జంట అవుతారనే రూలేమీ లేదు.

ఇలాంటి నిరాశా నిస్పృహలేర్పడినప్పుడు ఏం చెయ్యాలి? ఏదో ఒకటి చెయ్యాలి. అడవిలో దారి తప్పినప్పుడు చీకటిలో ప్రయాణం చేస్తూ పోకూడదు. చెట్టెక్కి కూర్చోవాలి. లేదా మంట వేసుకుని జాగారం చెయ్యాలి. ఏమీ చెయ్యకుండా ఉండటం కన్నా ఏదో ఒకటి చెయ్యటం మంచిది. ఏ ఓటమీ ముగింపు కాదనీ, అన్నీ కోల్పోయి కూడా జీరో–బేస్డ్ స్థాయి నుంచి తిరిగి జీవితం ప్రారంభించవచ్చని ***'విజయానికి అయిదు మెట్లు'*** లో చెప్పటం జరిగింది. అదే విధంగా – 'జీవితంలో విఫలమవటం' అన్న ప్రసక్తేలేదనీ, మరణం వల్ల గానీ, అభిప్రాయ భేదంవల్ల గానీ ఒకరు నిష్క్రమించినప్పుడు, ప్రేమని తిరిగి ఫ్రెష్‌గా మొదలుపెట్టవచ్చనీ, ప్రేమని పునఃప్రారంభించటం తప్పు కాదనీ చెప్పే ఒక ఆలోచనా విధానాన్ని అలవాటు చేసుకోండి. అటువంటి ఆరోగ్యకరమైన ప్రేమని అనాథలపట్ల, ప్రకృతిపట్ల, పనిపట్ల పెంచుకోండి. జీవితం ఎక్కడా ఆగిపోదనీ, విధి తాలూకు స్టీరింగ్ భగవంతుని చేతిలో ఉండదనీ, మనం ఎటు తిప్పితే జీవితం అటు వెళ్తుందనీ చాలామంది అనుకోరు. దురదృష్టవశాత్తూ పరిష్కారంకన్నా విధినే ఎక్కువ ఆశ్రయిస్తారు. మరో పరిష్కారమార్గం లేదని నమ్ముతూ, మనసులో బాధపడుతూ, మొహంపై చిరునవ్వు పులుముకుంటూ వర్తమాన జీవన విధానాన్ని కొనసాగిస్తారు.

ఒక ప్రైవేట్ సర్కిల్ ఏర్పాటు చేసుకొని, అందులో అందమైన పూదోట పెంచండి. ఆ పరిమళాన్ని ఆస్వాదిస్తూ జీవన మాధుర్యాన్ని అనుభవించండి.

**ఓ సోదరి:**

**నాకు పెళ్లై సంవత్సరం అయ్యింది. మావారికి నేను రెండో భార్యని. ముందే పెళ్లయ్యి బాబు కూడా ఉన్నాడు. విడాకులు తీసుకోవడంతో నేను చేసుకున్నాను. కానీ వాళ్లిద్దరికీ ఇంకా సంబంధం ఉందని తర్వాత తెలిసింది. ఆయన నాతో చెప్పకుండా వెళ్లిపోతాడు. పదిహేను రోజులైనా ఒక్కోసారి రాడు. ఫోన్ కూడా ఆఫ్ చేసేస్తాడు. ఈమధ్య రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నాం. దాంతో ఇద్దరూ పారిపోయారు. తర్వాత మళ్లీ వచ్చాడు. ఇంకెప్పుడూ తన దగ్గరికి వెళ్లను అని మాట ఇస్తే సరేనని ఒప్పుకున్నాను. కానీ మళ్లీ వెళ్లిపోయాడు. ఇప్పటి వరకూ జాడ లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. సలహా ఇవ్వండి.**

మీ సమస్య చాలా చిత్రంగా ఉన్నది. పరిష్కారం చెప్పటం కూడా కష్టమే. '..మీ భర్త పారిపోతే పట్టుకున్నాం' అన్నారు. మీకు ఈ విషయంలో సాయం చేసింది ఎవరు? మీ పెద్దలా? వారు ఏమని సలహా ఇస్తున్నారు?

ముందు ఒక విషయం నిర్ణయించుకోండి. ఇటువంటి వ్యక్తితో కలిసి ఉండాలనుకుంటున్నారా? విడిపోవాలనుకుంటున్నారా? కలిసి ఉండాలనుకుంటే, ఇద్దరూ కౌన్సిలరు దగ్గరకు వెళ్ళండి. అసలు ఆయన సమస్య ఏమిటో తెలుసుకోండి. మీ పట్ల నిరాసక్తతకు కారణాలు విశ్లేషించుకోండి. ఒకవేళ విడిపోవటమే పరిష్కారమనుకుంటే, మనోవర్తికై లాయరుని సంప్రదించండి. అన్నిటికన్నా ముందు, పెద్దల ద్వారా మీ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చెయ్యండి.

## ఓ సోదరి, దేవీపట్నం:

**నేనో ఉపాధ్యాయురాలిని. ఈ మధ్యనే పెళ్లయ్యింది. మావారు నన్ను చాలా బాగా చూసుకుంటున్నారు. కానీ నేను ఆయనకు ద్రోహం చేశాను. గతంలో నాతోపాటు పని చేసిన ఓ టీచర్ని ప్రేమించాను. అతనికి అన్ని విధాలుగా దగ్గరయ్యాను. కానీ అతడు నన్ను మోసగించాడు. ఇంట్లోవాళ్లు ఒప్పుకోవడం లేదని నాతో చెప్పి, రహస్యంగా మరో అమ్మాయిని చేసేసుకున్నాడు. నా తప్పూ ఉంది కాబట్టి నేనెవరికీ జరిగింది చెప్పలేదు. కానీ ఈ రోజు నా భర్త చూపించే ప్రేమ చూస్తుంటే మనసులో చాలా బాధగా ఉంటోంది. తనకి నిజం చెప్పేద్దామా అనిపిస్తోంది. చెబితే ఎలా రియాక్ట్ అవుతారో అని భయమేస్తోంది. అంత మంచి భర్తని దూరం చేసుకుని నేను బతకలేను. అందుకే ఏం చేయాలో సలహా ఇవ్వండి.**

మన దగ్గరవాళ్ళు మన పట్ల అమాయకంగా, ఆప్యాయంగా ప్రేమ చూపిస్తూ ఉంటే, గతం తాలుకు గిల్ట్ ఫీలింగ్ బాధపెడుతూ ఉండటం చాలా సహజం. కానీ ప్రాక్టికల్ గా ఆలోచించండి. ఈ విషయం మీ ఆయనకు చెపితే ఆయన దాన్ని రెండు విధాలుగా స్వీకరించవచ్చు. ఒకటి, మామూలుగా నవ్వేసి 'జరిగినదంతా మర్చిపో' అనవచ్చు. లేదా మిమ్మల్ని దగ్గరకు తీసుకున్నప్పుడల్లా మీ మాజీ స్నేహితుడు గుర్తొచ్చి మనసు బాధపెట్టుకోవచ్చు. సాధారణంగా రెండోది జరిగే అవకాశమే ఎక్కువ.

సజావుగా సాగిపోతున్న సంసారంలో లేనిపోని కలతలు తెచ్చుకోవలసిన అవసరం ఎందుకు చెప్పండి? ఈ రోజుల్లో వివాహత్పూర్వ పరిచయాలు లేని వ్యక్తులు చాలా తక్కువ అంటే విమర్శకులు నామీద దాడి చేయవచ్చు. పరిచయం ఎంతవరకూ వచ్చింది అన్నది ఇక్కడ సమస్య కాదు. మీరు ఈ విషయాన్ని వెల్లడి చేస్తే రాబోయే పరిణామాల గురించి ఆలోచించాలి. పాత జ్ఞాపకాలని పూర్తిగా తుడిచిపెట్టేయండి. మీ పాత స్నేహితుడిని మర్చిపోయి, మనసారా మీ శ్రీవారికి దగ్గరవటం మీరు మీ భర్తకి చేయగలిగే గొప్ప ఉపకారం.

**(కొనసాగింపు వచ్చేనెల)**